ప్రజాశక్తి

సోమవారం 17 నవంబర్ 2025 | 5 | అనంతపురం

నేడు కదిరిలో 'అక్టోబర్ విప్లవం - విశిష్టత'పై సదస్సు

హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కదిరి టౌన్

'అక్టోబర్ విప్లవం–విశిష్టత' అన్న అంశంపై కదిరి పట్టణంలో జిల్లా స్థాయి సదస్సును సోమవారం నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి జగన్మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి పట్టణం కోనేరు వద్ద ఉన్న ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం అయ్యే సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సీనియర్ నాయకులు జి.ఓబుళుహాజరవుతారన్నారు. సదస్సుకు ముందు ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి కోనేరు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సుకు పట్టణంలోని పుర ప్రముఖులు, మేధావులు, అభ్యుదయ వాదులు, వామపక్ష శ్రేయోభిలాషులు హాజరై జయప్రదం చేయాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జగన్మోహన్, కమిటీ సభ్యులు సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్ సుధాకర్ రెడ్డి కోరారు.

కొమలి రైల్వే స్టేషన్ వద్ద 2వ సారి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్న పోలీసులు

అసలేం జరిగింది..?

◆ మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్
◆ టీటీడీ మాజీ ఏవీఎస్‌వో మృతిపై కొనసాగుతున్న విచారణ
◆ అన్ని కోణాల్లోనూ ముమ్మర దర్యాప్తు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

టీటీడీ మాజీ ఏవీఎస్‌వో, తిరుపతి పరకామణి కేసులో కీలక సాక్షి సతీష్ కుమార్ మృతిపై దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. ఆయన మృతి ఎలా జరిగిందన్న విషయంపై అన్ని కోణాల్లో గత రెండు రోజులుగా వివరాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా సతీష్‌కుమార్ మరణించిన ప్రాంతంలో ఆదివారం రెండవ సారి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సతీష్ ఎత్తు, బరువు ఉన్న బొమ్మలను తయారు చేసి గుంతకల్ నుంచి చెన్నై వెళ్తున్న చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి కిందకు తోసేశారు. ఇలా మూడు బొమ్మలతో ప్రయోగం చేశారు. బొమ్మను తోసేసిన సమయంలో అది ఎంత దూరంలో పడుతుంది..? సతీష్ కుమార్ మృత దేహం ఎంత దూరంలో పడి ఉందన్న వివరాలను గుర్తించే విచారణ చేపట్టారు. ఓ వ్యక్తి రైలు నుంచి దూకితే ఎంత దూరం పడతాడు.. రైలు నుంచి ఎవరైనా తోసేస్తే ఎంత దూరం పడతారన్న విషయాలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేశారు. పోలీసులు విసిరిన బొమ్మల్లో మొదట బొమ్మ నిలబడి ఉండగా తోసేయగా అది 61 మీటర్ల దూరంలో పడింది. రెండోవది నిలబడి నిద్రిస్తున్న బొమ్మను విసరగా దాదాపు 88 అడుగులు దూరం పడింది. మూడో బొమ్మ కూర్చుని రైలు నుంచి జారి పడినట్లు విసరగా 46 అడుగుల దూరంలో పడింది. ఈ వివరాలతో సతీష్‌కుమార్ మృతదేహం పడి ఉన్న దూరాన్ని లెక్క గట్టారు. మరో వైపు సతీష్ కుమార్ గుంతకల్ నుంచి తిరుపతికి బయలుదేరినప్పటి నుంచి సిసి ఫుటేజ్‌ల్లో ఆయన ప్రయాణంకు తీసుకువెళ్లిన బ్యాగు నుంచి ఆ రైలులో ప్రయాణించిన దాదాపు 1000 నుంచి 1400 మంది ప్రయాణికుల వివరాలను సేకరించారు. ప్రయాణికుల్లో ఎవరైనా నేరస్తులు ఉన్నారా.. అన్న కోణంలో కూడా వివరాలు సేకరిస్తున్నారు. కాగా సతీష్ కుమార్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని ఏ వన్ బోగిలో సీట్ బుక్ చేసుకున్నాడు. అయితే అతని బ్యాగు అదే బోగీలోని వేరే నెంబర్ సీటు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఈ బ్యాగును ఇప్పటికే తిరుపతి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సతీష్‌కుమార్‌ది ముమ్మాటికి హత్యనే అంటూ ఆయన సోదరుడు శ్రీహరి గుత్తి రైల్వే పోలీసులకు మరోమారు తెలిపారు. టీటీడీ పరకామణి కేసులోని నిందితులు కొందరు తన సొదరుడిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును చేస్తూ కేసును ఓ కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

రబీలోనూ మందగమనమే..!

◆ వర్షాభావంలో వ్యత్యాసం.. సాగుపై ప్రభావం.. ◆ తగ్గిన అన్ని పంటల సాగు విస్తీర్ణం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో రబీ పంటల సాగు కూడా ఆశాజనకంగా సాగలేదు. 35 శాతంలోపే రబీ సాగు ముందుకు సాగింది. గత నెలలో కొద్దిపాటి వర్షాలొచ్చినప్పటికీ సాగు విస్తీర్ణం పెరగలేదు. అనంతపురం జిల్లాలో రబీలో సాధారణ సాగు 3.12 లక్షలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు సాగైంది కేవలం 92 వేల ఎకరాల వరకే ఉండటం గమనార్హం. ఇక రబీలో సాగయ్యే ప్రధాన పంటల సాగుకు సమయం కూడా ముగిసినట్టేనని రైతులు చెబుతున్నారు. గత నెలలో కొంత వరకు వర్షాలొచ్చినప్పటికీ రైతులు సాగుపై మొగ్గు చూపలేదు. ప్రధానంగా గిట్టుబాటు ధరల్లేకపోవడం వంటి కారణాలతో ఆసక్తి చూపలేదు. ఇక పెరగబోయే సాగు విస్తీరణం కూడా నామ మాత్రంగానే ఉండే అవకాశముండే అవకాశముంది.

35 శాతం రబీ సాగు

రబీలో అనంతపురం జిల్లాలో సాధారణంగా 3.12 లక్షల ఎకరాలు సాగవ్వాల్సి ఉండగా కేవలం 92 వేలు వరకే అయ్యింది. అంచనాలో 35 శాతమే అయింది. పంటల వారీగా చూస్తే రబీలో ప్రధాన పంట పప్పుశనగ సాధారణ సాగు ఈ సీజన్‌లో 1.60 లక్షల ఉండగా ఇప్పటికి 81 వేల ఎకరాల్లో అయింది. ప్రధాన పంట సాగు విస్తీర్ణం 50 శాతం పడిపోయింది. ఈ పంట సాగుకు సమయం కూడా అయిపోయిందని రైతులు చెబుతున్నారు. వేసిన పంట కూడా గత నెలలో పడిన వర్షాలకు దెబ్బతినడంతో రైతులు దున్నేసుకున్నారు. ఈ పంట కాకుండా తక్కిన అన్ని రకాల పంటలు కలిపి పది వేల ఎకరాల్లోనే సాగయ్యాయి. పప్పుశనగ తరువాత నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ సాగు అయ్యేది. ఇది సాధారణ సాగు 44 వేల ఎకరాలయితే కేవలం 1400 ఎకరాల్లోనే ఇది సాగైంది. మొక్కజొన్న 20 వేల ఎకరాల్లో అవ్వాల్సి ఉంటే 2300 ఎకరాల్లోనే సాగైంది. ఇలా ప్రధాన పంటల సాగు అన్నీ నామమాత్రంగానే రబీలో సాగయ్యాయి. ఖరీఫ్‌లోనూ జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగింది.

అక్టోబర్‌లో మంచి వర్షాలొచ్చినా ..

అక్టోబర్ మధ్యలో మంచి వర్షాలే వచ్చాయి. సీజన్ ప్రారంభమైన జూన్ నుంచి ఇప్పటి వరకు నెలల వారీగా చూస్తే వర్షపాతంలో అనేక వ్యత్యాసాలున్నాయి. మొత్తంగా చూసినప్పుడు సాధారణ వర్షపాతమే ఈ ఏడాది పడినట్టు కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ ఆరంభమైన జూన్ నుంచి సెప్టంబర్ వరకు కలిపి మొత్తం 321.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 335 మిల్లీమీటర్లు నమోదయింది. 4.3 శాతం అధికంగా వర్షపాతం పడినట్టు కనిపిస్తోంది. నెలల వారీగా చూస్తే జూన్‌లో సాధారణ వర్షపాతం 61.2 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 47.9 మిల్లీమీటర్లు పడింది. సాధారణ వర్షపాతంలో 21.7 శాతం లోటుపడింది. జులై నెలలో 64.3మిల్లీమీటర్లకుగానూ 34.7 మిల్లీమీటర్లే పడింది. 46 శాతం వర్షపాతం లోటుంది. ఆగస్టు నెలలో వస్తే సాధారణ వర్షపాతం 84.4 మిల్లీమీటర్లకుగానూ 165.9 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 96.6 శాతం పడింది. ఖరీఫ్ సీజన్‌లో ఆఖరు మాసమైన సెప్టంబర్‌లో సాధారణ వర్షపాతం 111.6 మిల్లీమీటర్లకుగానూ 87 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 22 శాతం లోటు వర్షపాతం నమోదయ్యింది. రబీ ఆరంభమైన అక్టోబర్ మాసంలో సాధారణ వర్షపాతం 100.7 మిల్లీమీటర్లు అయితే 106.6 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే అధికంగా వర్షపాతం పడింది. మొత్తంగా జూన్ నుంచి ఇప్పటి వరకు 442 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా 448.8 మిల్లీమీటర్లు పడింది. ఇలా వర్షపాతం రావడంలో వ్యత్యాసాలు పంటల సాగుపై ప్రభావం చూపాయి. సరైన సమయంలో వర్షాల్లేకపోవడంతో పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపలేదు.

నీటితో మరువ పారుతున్న బుక్కపట్నం చెరువు

మరువపారిన బుక్కపట్నం చెరువు

కొత్తచెరువు : రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద చెరువు అయినా బుక్కపట్నం చెరువు పూర్తి స్థాయిలో నిండింది. ఇటీవల చిత్రావతి నీరు చెరువులోకి వచ్చాయి. దీంతో పాటు హంద్రీనీవా కాలువ నుంచి నీరు వదలడంతో చెరువు పూర్తి స్థాయిలో నిండింది. ఆదివారం మధ్యాహ్నానికి చెరువు పూర్తిగా నిండి మరువపారింది. చెరువు మరవపారుతుండడంతో నీటిని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. చెరువు నీటితో నిండడంతో దీనికింద ఉన్న 3170 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది.

రాష్ట్ర దిశను మార్చేలా విశాఖ సిఐఐ సమ్మిట్

టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సిఐఐ సమ్మిట్ నిలిచిందని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ తెలియజేశారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ సిఐఐ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 613 ఒప్పందాలు కుదరడం రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో చేసుకున్న ఒప్పందాలన్నీ మూడున్నరేళ్లలో పూర్తి అయ్యి ఆచరణలోకి వస్తాయన్నారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలియజేశారు. జగన్ రెడ్డి విధ్వంసకర విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన పరిశ్రమలన్నింటినీ మళ్లీ రాష్ట్రానికి తీసుకుని వచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలియజేశారు. ఈ సమావేశంలో ఏపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, కురుబ సాధికార సమితి సభ్యులు కురుబ నారాయణస్వామి పాల్గొన్నారు.

కార్మికులందరికీ ఇఎస్‌ఐ ప్రయోజనాలు

◆ ఆరోగ్య బీమాతో కుటుంబానికి భద్రత ◆ ఇఎస్‌ఐ అనంతపురం శాఖ మేనేజర్ ఎ.జగదీశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వివిధ ప్రయివేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఇఎస్ఐ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఇఎస్ఐ అనంతపురం శాఖ కార్యాలయం మేనేజర్ ఎ.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇఎస్ఐ పథకం ప్రయోజనాలు పొందడం ప్రతి కార్మికుడి హక్కు అన్నారు. ఇఎస్ఐ ప్రాధాన్యత, ప్రయోజనాలు, చందా షరతులు, అవధి, రేటు తదితర అంశాలను ప్రజాశక్తి ముఖాముఖిలో తెలియజేశారు.

ఎ.జగదీశ్వర్‌రెడ్డి

ప్ర: ఇఎస్‌ఐ వల్ల ప్రయోజనాలు ఏమిటి

మేనేజర్ : కార్మికులు అనారోగ్యానికి గురైనప్పుడు ఉచితంగా వైద్య చికిత్సలు పొందవచ్చు. ఇఎస్ఐ గుర్తింపు కార్డు పొంది ఉన్న ప్రతి కార్మికుడికి, వారి కుటుంబానికి ఆరోగ్య భద్రత లభిస్తుంది. 34 దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య చికిత్సలు ఉచితంగా పొందవచ్చు. కార్మికులు తాత్కాలిక వైకల్యం ఏర్పడితే వారికి అశక్తి ఉన్నంత వరకు సగటు దినసరి వేతనంలో 90 శాతం చెల్లిస్తారు. శాశ్వత వైకల్యం చెందితే జీవితాంతం మెడికల్ బోర్డు నిర్ణయించిన రేటు ఆధారంగా ప్రయోజనం పొందవచ్చు. కార్మికులు పని చేస్తూ మృతి చెందితే భార్యకు జీవితాంతం, లేదా పునర్ వివాహం వరకు, మగ పిల్లలకు 25 సంవత్సరాల వయసు వరకు, ఆడపిల్లలకు వివాహం వరకు పింఛన్ లభిస్తుంది.

ప్ర: ప్రసూతి ప్రయోజనాలు ఏమిటి.?

మేనేజర్ : ఇఎస్‌లో మహిళా కార్మికులకు ప్రసూతి ప్రయోజనాలు ఉంటాయి. మొదటి ప్రసవాలకు 26 వారాలు సెలవులు వర్తిస్తాయి. దత్తత, అద్దె గర్భం ద్వారా బిడ్డను పెంచిన వారికి 12 వారాలు సెలవుతో కూడిన దినసరి వేతనం 100 శాతం పొందవచ్చు. బీమా చేసుకున్న వ్యక్తికి అతని కుటుంబ సభ్యులకు హాస్పిటలైజేషన్‌తో సహా వారి అర్హతను అనుసరించి వైద్య సంరక్షణ సౌకర్యం లభిస్తుంది. సూపర్‌స్పెషాలిటీ ట్రీట్‌మెంట్, అంత్యక్రియలకు రూ.15 వేలు, పునరావాస భృతి, వృత్తి పరమైన పునరావాసం, ఉద్యోగ విరమణ, స్వచ్ఛంద విరమణ, ప్రీ మెచూర్ రిటైర్‌మెంట్, రాజీవ్‌గాంధీ శ్రామిక కళ్యాణయోజన (నిరుద్యోగభృతి), అటల్ బీమిత వ్యక్తి కళ్యాణ యోజన వంటి ప్రయోజనాలు లభిస్తాయి.

ప్ర:ఎవరెవరూ ఇఎస్‌ఐ పథకానికి అర్హులు.? జిల్లాలో ఎంత మంది ఉన్నారు.?

మేనేజర్ : ప్రయివేట్, ప్రభుత్వ రంగాల్లో పని చేస్తూ రూ.21 వేల వేతనంలోపు పొందే వారూ ప్రతి ఒక్కరూ ఇఎస్ఐ అర్హులే. 10 మంది పని చేసే వర్క్‌షాపు నుంచి భారీ పరిశ్రమల్లో పని చేసే కార్మికులందరూ ఇఎస్ఐ సౌకర్యం పొందవచ్చు. అనంతపురం జిల్లాలో 40 వేల మంది పైబడి ఇఎస్ఐ గుర్తింపు కార్డు పొందిన కార్మికులు ఉన్నారు. వారందరికీ ఇఎస్ఐ ఫలాలు అందుతాయి.

ప్ర: ప్రయివేటు రంగాల్లో ఇఎస్‌ఐ సక్రమంగా అమలు జరుగుతోందా.?

మేనేజర్ : కార్మికులతో పని చేయిస్తున్న ప్రయివేటు సంస్థలు వారి భద్రతకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు అందడంలో యజమానులు వారి వంతుగా ఇఎస్ఐ చందా చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన ఆదేశాలు ఉన్న నేపథ్యంలో ఆయా యాజమాన్యాలు కార్మికుల కోసం చందా చెల్లిస్తున్నారు. ప్రభుత్వం తరుపున అవగాహన కల్పిస్తున్నాం. కార్మికులు వారి హక్కులపై అవగాహన కలిగి యాజమాన్యాలతో మాట్లాడి ఇఎస్ఐ సదుపాయం పొందాలి.

రోడ్లపై పశువుల సంచారం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో ఏ రోడ్డు చూసినా.. ఏ వీధికి వెళ్లినా పదుల సంఖ్యలో పశువులు సంచరిస్తూ.. రోడ్డుకు అడ్డంగా పడుకుని దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా వినాయక కూడలి, మున్సిపల్ కూరగాయల మార్కెట్, కణేకల్ రోడ్డు, నేతాజీ రోడ్డు, లక్ష్మీబజార్, తదితర చోట్ల పెద్దసంఖ్యలో రోడ్డుకు అడ్డంగా ఉంటూ పాదాచారులు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో నేసేపేటలోని ఇరుమాళ్ సిద్దన్న వీధిలో ఓ పశువు ద్విచక్ర వాహన చోదకుడిపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసింది. ఇలాంటి ఘటనలను తరచూ చోటు చేసుకుంటూ ప్రజలు, వాహనదారులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. మున్సిపల్ కూరగాయల మార్కెట్, గాంధీ కూడలి వద్ద కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఇతర వ్యర్థాలను రోడ్డు పక్కన పడేయడం వల్ల పశువులు వాటిని తినేందుకు వచ్చి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఈ విషయమై ప్రజలు పలుమార్లు మున్సిపల్, పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, కౌన్సిల్ సమావేశాల్లో పాలకమండలి సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. పలుమార్లు పశువుల యజమానులకు మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ జారీ చేసినా అడ్డుకట్ట పడలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

రాయదుర్గంలో వాహనదారులు, ప్రజల ఇబ్బందులు

వినాయక కూడలి, గాంధీ కూడలిలో రోడ్డుపై తిరుగుతున్న పశువులు

స్ఫూర్తి ప్రదాత భక్త కనకదాసు

మంత్రి సవిత, ఎంపీ బీకే, ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

భక్త కనకదాసు జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, హిందూపురం పార్లమెంటు సభ్యులు బీకే పార్థసారథి, పురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ తెలియజేశారు. ఆదివారం హిందూపురం పట్టణంలో భక్త కనకదాసు జయంతి వేడుకలు కురువ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. తొలుత కురువ సంఘం నుండి నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన కురుబలు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కేరళ బందం నత్యం చేస్తూ సందడి చేశారు. పలువురు భక్త కనకదాసు వేషధారణలో ర్యాలీలో పాల్గొన్నారు. డప్పుల వాయిస్తూ కంబళి ధరించి కురుబలు ర్యాలీలో పాల్గొన్నారు. మంత్రి సవితతో పాటు ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ తదితరులు ప్రత్యేక వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న కనకదాసు విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కనకదాసు విగ్రహానికి భారీ పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజ హితం కోసం కషిచేసిన ఆదర్శ పురుషుడు భక్త కనకదాసు అన్నారు. తన ఆధ్యాత్మిక గీతాల ద్వారా సమాజ చైతన్యం కోసం కనకదాసు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీలకు చెందిన నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, కురుబలు పాల్గొన్నారు

ర్యాలీలో పాల్గొన్న మంత్రి సబితమ్మ, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంపి పార్థసారథి

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010కంటే ముందు ఉపాధ్యాయులుగా నియామకం పొందిన వారు తప్పకుండా టెట్ క్యాలిపై కావాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. 2010 కంటే ముందు నియామకం అయిన వారు డిఎస్సి ద్వారా నియామకం చెందారని, ప్రతి సంవత్సరం పాఠశాల విద్యాశాఖ నిర్వహించే శిక్షణా తరగతులకు హాజరవుతున్నారని తెలిపారు. 12, 18, 24 సంవత్సరాలు స్కేళ్ళు తీసుకోవాలంటే ఇ.ఓ.టి, జిఓటి పరీక్షలు వ్రాస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పిఎంశ్రీ తరహాలోనే రాష్ట్రంలో సిఎంశ్రీ పాఠశాలలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శులు సంజీవ్ కుమార్, రాముడు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నేతలు

హంద్రీనీవా కాలువలో డాక్టర్ గల్లంతు

కార్తీక్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-ఆత్మకూరు

అనంతపురం జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని హంద్రీనీవా నీటి కాలువలో ప్రమాద వశాత్తు పడి ఓ ప్రభుత్వ డాక్టర్ గల్లంతు అయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అనంతపురం జిల్లా బెళుగుప్ప ప్రభుత్వ ఆసుపత్రిలో కార్తీక్ వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనార్థం వెళ్లారు. దర్శనం అనంతరం వనభోజనాలు చేశారు. అక్కడి నుంచి చేతుల కడుక్కునేందుకు హంద్రీనీవా కాలువ వద్దకు కార్తీక్ వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి ఆయన నీటిలో పడ్డాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో అందులో కొట్టుకుపోయాడు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో కార్తీక్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

30న ఎన్నికల కమిషన్ పనితీరుపై బహిరంగ సభ

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షులు కె.అల్తాఫ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ పని తీరుపై ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షులు కె.అల్తాఫ్ అన్నారు. ఆదివారం ఆ వేదిక ఆధ్వర్యంలో పెన్షనర్స్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షులు కె.అల్తాఫ్, పౌర సంఘం నాయకులు ఆదినారాయణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు గోపాల్ నాయక్, జై భారత్ నాయకులు కుల్లాయప్ప, రాయలసీమ విద్యావంతల వేదిక నాయకులు వెంకటేష్, అనంత హక్కుల పోరాట సంఘం నాయకులు సోమర రాహుల్, ఆర్ట్స్ కాలేజ్ విద్యార్థి సీమ యువ నాయకులు అశోక్ తదితరులు హాజరై ఎన్నికల కమిషన్ పని తీరు, ప్రజాస్వామ్యంపై దాని ప్రభావం తీవ్రంగా పడుతున్నందున భవిష్యత్తులో ప్రజాస్వామ్యం కనుమరుగైపోతుందని అందుకు దాన్ని పరిరక్షణకై ప్రజలు నడుం బిగించాలన్నారు. 30న నిర్వహిస్తున్న బహిరంగ సభకు ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శామీర్, పరమేశ్వరరావు, రామకృష్ణ, సాంబశివుడు, సుబ్బరాయుడు, సదాశివుడు, టి.యన్.రసూల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

'మహద్' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రముఖ కవి తలారి మోహన్ రాసిన 'మహద్' పుస్తకాన్ని ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో రిథి స్కిన్, హార్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వంశీకృష్ణగారు ఆవిష్కరించారు. తర్వాత పుస్తకాన్ని ప్రముఖ అంబేద్కరిస్టు కె.విద్యాసాగర్ తిలక్, సామాజిక కార్యకర్త అరుణా భీమిరెడ్డి సమీక్షించారు. పుస్తక రచయిత తలారి మోహన్ తన స్పందనలో బాబాసాహెబ్ ప్రసంగాలు నేటికీ సమాజానికి రెలవెంట్‌గా ఉండడం గొప్ప విషయం అంటూ కొనియాడారు. మహద్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రామచంద్ర బాబాజీ మోరే జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చామలూరు రాజగోపాల్, హనుమంతురాయుడు, అబ్దుల్ వాహబ్‌ఖాన్, శివరామకృష్ణ, సడ్లపల్లె చిదంబరరెడ్డి, చిన్నకోట్ల పెద్దిరెడ్డి, కైమలి, నిజవల్లి బాబు, నానీల నాగేంద్ర, ములకలేడు సాయినాథ్, గోరంట్ల సాయిపీరా, అశేరా, తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతి

కనకదాసకు పూజలు చేస్తున్న కురుబలు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని ఆత్మ రామాలయం దేవాలయంలో కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా కురవ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల కృష్ణయ్య మాటాడుతూ రాబోవు రోజుల్లో కనకదాస విగ్రహ ప్రతిష్టకు స్థలం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు పట్నం నగేష్, బ్యాళ్ల నాగేంద్ర, బండమీదపల్లి చెంద్రారాయుడు, శింగనమల కరెంట్ అనిల్‌కుమార్, శోదనపల్లి మల్లికార్జున, మంకెన నాగేంద్ర, చిన్నజలాలపురం సత్యమూర్తి, కురుబ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి ఆశయాలను సాకారం చేద్దాం

వాల్మీకి గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మునిప్రసాద్

మాట్లాడుతున్న వాల్మీకి అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

వాల్మీకి మహర్షి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అఖిల భారత వాల్మీకి గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దాసరి సుబ్రమణ్యేశ్వర మునిప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలమురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం అఖిల భారత వాల్మీకి గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకుల్లో విద్యావ్యాప్తిని పెంచి తద్వారా ప్రతి కుటుంబంలో ఉన్నత భవిష్యత్తు ఉండేలా తీర్చిదిద్దాలని ఆకాంక్షతో సమావేశం నిర్వహించామన్నారు. వాల్మీకి మహర్షి రాసిన రామాయణం సోదర భావం, పితృవాక్య పరిపాలనను భావితరాలకు తెలియజేస్తుందన్నారు. ఆ దిశగా అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రవీంద్రనాథ్, ఈశ్వరయ్య, ఉషారాణి, ఈశ్వరయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, మురళీమోహన్, వరలక్ష్మి, సౌజన్య, సభ్యులు పాల్గొన్నారు.

'అనంతగిరి'లో అంబరాన్నంటిన సంబరాలు

బహుమతులు పొందిన వారితో రిసార్ట్ అధినేత

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మన్నీల సమీపంలోని అనంతగిరి ఫార్మ్‌ల్యాండ్, రిసార్ట్‌లో ఆదివారం కార్తీక వనమహోత్సవంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అనంత రియాల్టీ అధినేత కట్టా సుబ్రమణ్యం మాట్లాడుతూ కార్తీక మాసంలో తమ కస్టమర్లు, మిత్రులు, శ్రేయోభిలాషులకు శుభం కలగాలని ఆకాంక్షతో రీసార్ట్‌లో వనమహోత్సవం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతమైన రాబడికి కేరాఫ్ అడ్రస్‌గా అనంత రియాల్టీ సంస్థ నిలిచిందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ టూరిజం శాఖతో ఒప్పందం సంతోషకంగా ఉందన్నారు. అనంతరం లక్కీ డ్రా ద్వారా ఎంపికైన కస్టమర్లకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అనంత రియాల్టీ సంస్థ సిబ్బంది, పలువురు ప్రముఖులు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ సేవ పథకంలో భాగంగా ఎస్వీ డిగ్రీ వైస్‌ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఏర్పాటు చేసిన జాతీయ ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. ఇందులో భాగంగా బి.యాలేరు గ్రామంలో సర్పంచు ఎ.రేణకమ్మ ఆధ్వర్యంలో అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచు ఎ.ఎర్రిస్వామి, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, పాఠశాల హెచ్‌ఎం కె.రవిప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న దాతలు

గుంతకల్లు : భక్త కనకదాస జయంతి సందర్భంగా స్థానిక కురుబ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం, వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, మండల టిడిపి ఇన్‌ఛార్జి నారాయణస్వామి, టిడిపి యువనేత, కౌన్సిలర్ పవన్‌కుమార్ గౌడ్, తదతరులు హాజరై పనూజలు చేశారు. అనంతరం కురుబ సంఘం కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన వనభోజనలు, రక్తదాన శిబిరంలో పాల్గొని కురుబ సోదరులు కనకదాసు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కురుబ చంద్రశేఖర్, పాతకొత్త చెరువు శీనా, కురుబ శివప్ప, గౌతమ్ గుప్తా, గణేష్, ప్రభా, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ఊపిరి 'శ్రీబాగ్ ఒడంబడిక'

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ ఊపిరి అస్తిత్వమే శ్రీబాగ్ ఒడంబడిక అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శ్రీబాగ్ ఒప్పందం చేసుకుని 88 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఆదివారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో 100 టిఎంసి రామాంజనేయులు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా పప్పూరు రామాచార్యులు, కల్లూరు సుబ్బారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా వేమన అధ్యయన వేదిక నాయకులు అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి శ్రీ బాగ్ ఒప్పందం యొక్క ప్రాధాన్యత, చారిత్రక నేపథ్యాన్ని వివరించగా, రాయలసీమ కథా రచయిత బండి నారాయణస్వామి భౌగోళిక, సాంస్కృతిక, రాజకీయ రాయలసీమ నేపథ్యం, అవసరాన్ని వివరించారు. అలాగే జలసాధన సమితి నాయకులు అడ్వకేట్ రామ్‌కుమార్ రాయలసీమకు జరిగిన, జరుగుతున్న అన్యాయం, వివక్షతను తెలియజేశారు. అలాగే కోస్తాంధ్ర నాయకులు కృష్ణ, తుంగభద్ర జలాలను రాయలసీమకు కాకుండా ఏవిధంగా కోస్తాకు తరలించారు.. రాయలసీమ కోల్పోయిన భూభాగాలు, ఖనిజ, నీటి వనరులను ఏవిధంగా కోల్పోయామో వివరణాత్మకంగా తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రజా కళామండలి నాయకులు, రాయలసీమ విద్యావంతులు వేదిక, రైతుసంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనంత హక్కుల పోరాట సంఘం సోమర రాహుల్, తెలుగు వెలుగు టీవీ రెడ్డి, ఎస్సీ ఎస్టీ జెఎసి నాయకులు సాకే హరి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు వేమన, రాయలసీమ యువ నాయకులు అశోక్‌రెడ్డి, ఎస్‌కెయు రామాంజి, రాయలసీమ విద్యార్థి శక్తి హరిత, పౌర హక్కుల సంఘం నాయకులు ఆదినారాయణ, రాయలసీమ ఉద్యమకారులు, రచయితలు, తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు

సమావేశంలో మాట్లాడుతున్న కె.వీరరాజు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 23వతేదీన కళ్యాణదుర్గంలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు తెలిపారు. ఆదివారం నగరంలోని సంగమేష్ నగర్‌లో ఉన్న జెవివి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కెపి.చిత్తప్ప అధ్యక్షతన చెకుముకి సంబరాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల నుంచి మండలానికి రెండు జట్ల చొప్పున 44 జట్లు జిల్లాస్థాయిలో పాల్గొంటాయని తెలిపారు. ప్రతి జట్టులో 8, 9, 10వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఉంటారన్నారు. వీరంతా ఇప్పటికే పాఠశాల స్థాయి, మండల స్థాయిలో మొదటి స్థానంలో ఎంపికైన వారు అన్నారు. జిల్లాస్థాయిలో జరిగే పోటీల అనంతరం మొదటి స్థానంలో నిలిచిన జట్లను రాష్ట్రస్థాయికి ఎంపక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ముక్కర రామిరెడ్డి, ఎస్.గాంగేనాయక్, మ్యాజిక్ సబ్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మీనారాయణ, బి.నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంపై దాడి అమానుషం

అనంతపురం : హిందూపురంలో వైసిపి కార్యాలయం పై ఎమ్మెల్యే నందమూరి బాల కృష్ణ అనుచరులు దాడి చేయడం అమానుషమని వైసిపి మండల కన్వీనర్ బాలు పోతున్న ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే నాయకుల చేతిలో కీలుబొమ్మగా మారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం స్పందించి భవిష్యత్తులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసిపి కార్యాలయంపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

శింగనమల : హిందూపురంలో వైసిపి కార్యాలయంపై టిడిపి కార్యకర్తలు దాడి చేయడం ప్రజాస్వామికమని వైసిపి మండల కన్వీనర్ పూల ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇలాంటి హింసాత్మక ఘటనలు సమాజానికి ముప్పు అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందనడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వైసిపి కార్యాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కార్తీక వనభోజనాలు

బెలుగుప్ప : రెడ్డి ఆత్మీయత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పెన్నానది ఒడ్డున వెలిసిన బూదిగుమ్మ సంజీవరాయుడు, పద్మావతి, వెంకటరమణ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంవత్సరానికి ఒకసారి రెడ్డి కులస్తులు కార్తీకమాస వనభోజనాలను విజయవంతం చేస్తూ ఉండటం సంతోషకరమన్నారు. అనంతరం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుత్తి డిప్యూటీ డిఇఒ పి.మల్లారెడ్డి, రెడ్డి ఆత్మీయత సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్డి ఆత్మీయ సంఘం నాయకులు

కరపత్రాలు విడుదల చేస్తున్న ఎపి బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

20న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి -పామిడి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వతేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని బేల్దారి సంఘం సీనియర్ నాయకులు కె.మల్లేష్, పి.శివకుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాబు, దస్తగిరి ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, షాషావలి, లక్ష్మణ్‌కుమార్, సాయికుమార్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలు, పాఠశాలల ముందు సభలు నిషేధం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరపాలక సంస్థ, కెఎస్‌ఆర్ పాఠశాల, జూనియర్ కళాశాలల ముందు రోడ్డుపై సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రదేశాల్లో నిత్యం వాహనాలు, పాదచారుల రద్దీ అధికంగా ఉండటం, తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండటంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు, విద్యార్థుల విజ్ఞాపనల మేరకు ఆయా ప్రదేశాల్లో ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించకుండా నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఇందుకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాల వారు సహకరించాలని కోరారు.

రైతు సేవా సహకార సంఘం జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-నార్పల

అఖిల భారత సహకార సొసైటీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో ఛైర్మన్ ఉమామహేశ్వరనాయుడు మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, రుణాలు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నార్పల సొసైటీ మానిటరింగ్ అధికారి ఇస్మాయిల్, సొసైటీ సిఇఒ ఎం.తారకరెడ్డి, సిబ్బంది బాబయ్య, ఆదిరెడ్డి, ప్రశాంతి, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సహకార సొసైటీ జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

కుక్కల దాడి..16 గొర్రెలు మృతి

పరిశీలించిన వామపక్ష నాయకులు

మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని అమ్మలదిన్నె గ్రామంలో రేకుటషెడ్డులో ఉన్న గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 16 గొర్రెలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని అమ్మలదిన్నె గ్రామానికి చెందిన గొర్ల పుల్లయ్య 16 గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలోనే ఒక షెడ్డు వేసుకుని రాత్రిళ్లు గొర్రెలను ఉంచుకునేవాడు. ఈనేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున వీధికుక్కలు గొర్రెల మందపై దాడి చేసి గొర్రెలను చంపినట్లు వాపోయాడు. దీంతో దాదాపు రూ.2లక్షల వరకూ నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి అమ్మలదిన్నె కుళ్లాయప్ప, సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం మృతిచెందిన గొర్రెలను పరిశీలించి బాధిత కాపరితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత గొర్రెల కాపరికి తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

టిడిపి నాయకుడికి పరామర్శ

సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-శింగనమల

అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని పెద్ద జలాలపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సుబ్బారెడ్డిని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మీనారాయణ, మాజీ మండల కన్వీనర్ చిదంబరి దొర, చిదానందనాయుడు, చెన్నయ్య, ప్రసాద్‌రెడ్డి, సుధీర్‌నాయుడు, గొల్ల గంగన్న, తలారి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ

కృష్ణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980-1983 ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు కళాశాలతోపాటు ప్రభుత్వ ఆసుపత్రికి 16 సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. అనంతరం టిడిపి రాయదుర్గం పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైన కృష్ణమూర్తిని సహ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కోర్ కమిటీ ఛైర్పర్సన్ కె.నాగరాజు, వైస్ ఛైర్‌పర్సన్ ఎం.శివానంద, కోశాధికారి శేషప్రభ, రామదాసు, కోరు కమిటీ సభ్యులు మురడప్ప, జింక సత్యనారాయణ, సాయిప్రసాద్, ఎం.రామచంద్ర, ప్రధానోపాధ్యాయులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

సరుకులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ నిర్మలమురళి ఆధ్వర్యంలో గర్భిణి యమునకు సీమంతంతోపాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ట్రస్టు సభ్యులు రేజీ కురియన్ సహకారంతో ఈ సాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు భవాని, ఓబుళపతి, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగం, నిరక్ష్యరాస్యతపై సర్వే

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో ఎస్‌కెయు ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఏర్పాట చేసిన ప్రత్యేక శిబిరంలో ఆదివారం 'నిరక్షరాస్యత-నిరుద్యోగంపై సర్వే' నిర్వహించారు. ఇందులోఉ భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నిరక్షరాస్యత-నిరుద్యోగంపై అవగాహన కల్పించడంతోపాటు గ్రామస్తులను వివిరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మై భారత్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ప్రొప్రైటర్ ధనుంజయ, అనంతపురం స్టీల్ ప్రయివేట్ లిమిటెడ్ సాయి రంగనాథ్, బీ.ఫార్మసీ ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్య సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐసియులో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం : టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతున్నారు. మూడురోజులుగా బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలోని ఐసియులో చికిత్స తీసుకుంటున్నారు. దీంతో రామలింగారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆయన స్వగ్రామం సిద్ధరాంపురంలో టిడిపి నాయకులు, అభిమానులు వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో 501 టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో సిద్ధరాంపురం చెరువు సంఘం ప్రసిడెంట్ పెద్దశివయ్య, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల కమిటీ ఛైర్మన్ లింగమయ్య, ఎంపిపి స్కూల్ కమిటీ ఛైర్మన్ అంజి, తలారి నాగు, కాటమయ్య, చెన్నమయ్య, నారాయణస్వామి, శివ, చిన్న మద్దిలేటి, ఆది, వెంకటేష్, గోపీ, కొండన్న, మహేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన విజయలక్ష్మి గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతుండేది. ఈక్రమంలో పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్రమనస్తాపం చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కిందపడి రైతు మృతి

గుత్తి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో కింద పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాల మేరకు.. జొన్నగిరి గ్రామానికి చెందిన రైతు శివప్రసాద్ ఇంట్లో నడుచుకుంటూ వెళ్తూ కుప్పకూలి కింద పడిపోయాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న రైతును గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో వైద్యులు అత్యవసర చికిత్సలు అందించినప్పటికీ కోలుకోలేక మరణించాడు. శివప్రసాద్ గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుత్తి : మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామం శివారులో 67వ జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాల మేరకు.. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన ఓబులేసు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఆటోలో బాడుగుకు వెళ్తుండగా మలుపులో వేగంగా వెళ్తూ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పర్యవేక్షకులుగా డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, సహ గ్రంథాలయాధికారి డి గోవిందు, న్యాయ నిర్ణేతలుగా రిటైర్డ్ టీచర్ శ్రీరాములు, డాక్టర్ రామలింగమయ్య, విశ్రాంత డీఎస్పీ జె.హరి, విశ్రాంత టీచర్ రియాజుద్దీన్ వ్యవహరించారు. వీరిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికీ ఈనెల 20వతేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, సీనియర్ అసిస్టెంట్ రాజు, రామాంజినమ్మ, జిఎం బాషా, కిరణ్, జీవన, బాలచంద్ర, ఇందిరమ్మ, ఉజ్జనేశ్వరి, శివమ్మ, శిరీష, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వక్తలు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయం ఉద్యమ సారథుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాల పఠనం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి సుజాత, జూనియర్ కళాశాల లెక్చరర్ పక్కీరప్ప, మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం ఖలీల్, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఆదిలక్ష్మి, హేమలత, పాఠకులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.వేణుగోపాల్, సామాజిక కార్యకర్త సలీం, గుత్తి కోట గైడ్ ఎం.రమేష్, కార్తీక్, షేక్షావలి, సిబ్బంది పి.సిద్ధార్థ్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నాయకులను స్మరించుకున్నారు. ఇందులో భాగంగా అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్.రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి, బి.నారాయణరెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లు, గుత్తిలో గ్రంథాలయ ఉద్యమ సారథుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

CHANGE OF NAME

I, ABDUL RAWOOF (OLD NAME), S/o MOHAMMED HUSSAIN SAHEB, R/o: 9-4-530/789-12, Indhiramma Colony, Opposite Ismail Masjid, Rayadurgam - 515865, Anantapuramu District of Andhra Pradesh. I changed my name to **CONTRACTOR ABDUL RAWOOF (NEW NAME).** Henceforth, **I will be known as CONTRACTOR ABDUL RAWOOF.**

CHANGE OF SURNAME

I, Battula Gayathri (old Name),W/O.Batthala Thimmappa Govindarajulu, Resident of D.NO:7/5/684,B.T.P.Road, Rayadurg -515865, Anantapur (District), A.P. I have Changed my Surname from **"BATTULA"** (Old Surname) to **"BATTHALA"** (New Surname) Hereafter my name is known as **BATTHALA GAYATHRI (New Name)**

CHANGE OF SURNAME

I, Battula Thimmappa Govindarajulu (Old Name), S/O Battula Narasimhappa Thimmappa, Resident of D.NO: 7/5/684,B.T.P ROAD, RAYADURG -515865, ANANTAPUR (District),A.P. I have Changed my Surname from **"BATTULA THIMMAPPA"**(OLD SURNAME) to **"BATTHALA THIMMAPPA"** (NEW SURNAME), Hereafter my name is known as **BATTHALA THIMMAPPA GOVINDARAJULU (New Name)**